క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొడంగల్: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు కరెంటు ఉండదని ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్‌లో రిపేర్లు, పాత సామగ్రి తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సామూహిక హనుమాన్ చాలీసా

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్ధనొంపు ఆంజనేయ స్వామికి హిందూ వాహిని శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ పరిసరాలను శుభ్రపరిచి, స్వామివారికి పంచామృతాభిషేకం, సిందూర లేపనం, అష్టోత్తర శతనామావళి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం హిందూవాహిని శాఖ సభ్యులు, భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. 22 వారాలుగా ప్రతి శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని శాఖ సభ్యులు తెలిపారు.

కష్టంగా కాకుండా.. ఇష్టంగా చదువుకోవాలి

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: కష్టంగా భావించకుండా ఇష్టపడి చదువుకోవాలని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ శివారులోని మహాత్మా జ్యోతీరావ్‌పూలే బాలుర గురుకుల పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకొని, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రతిభ చూపిన వారిని మాజీ ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. ఇందులో గురుకుల పాఠశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గీతాజ్ఞాన యజ్ఞం

యాలాల: మండల కేంద్రంలో సోమవారం గీతాజ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి యజ్ఞం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో గీతాజ్ఞాన యజ్ఞ కార్యక్రమాలను చేపట్టామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

జ్యోతిర్లింగాల మహాపడిపూజ నేడు

యాలాల: ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజను ఆదివారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో తన నివాసంలో ఉదయం 10 గంటల నుంచి పూజ ప్రారంభమవుతుందని, కార్యక్రమానికి శివ భక్తులు, భక్తులు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.

బీటీరోడ్లకు మోక్షమెప్పుడో?

- వేసవిలో దమ్ముధూళి.. వానాకాలం బురద మయం
- ప్రభుత్వాలు మారినా.. మారని పల్లె రహదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందుల్లో గ్రామీణ ప్రాంత ప్రజలు

కుల్కచర్ల: పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ.. గ్రామీణ ప్రాంతాల దుస్థితి మారడం లేదు. అవే మట్టిరోడ్లు. దుమ్ముధూళితో నిండిన పరిసరాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఒక పల్లె అభివృద్ధి చెందాలంటే.. తొలుత రోడ్డు సౌకర్యం, ఆ తరువాత మౌలిక సౌకర్యాలు కల్పించాలి. వసతుల సంగతి ఎలా ఉన్నా.. కనీసం రోడ్డు మార్గం సరిగా లేక పల్లెప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక అత్యవసర సమయాల్లో వారి కష్టాలు చెప్పనలవి. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామీణ ప్రాంతాలకు రహదారులు లేక.. అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

కంకర పరిచి.. వదిలేశారు..

గ్రామాలకు బీటీరోడ్లు సరిగా లేకపోవడంతో.. ఆ ప్రభావం అభివృద్ధిపై పడింది. సూర్యానాయక్ తండా, గోప్యానాయక్ తండా, ఎర్రగోండ్ తండా, చాకల్‌పల్లి తండా, పటేల్ చెరువు తండా, అడవివెంకటాపూర్, బండమీది తండా నుంచి జీతుల తండా, భోజ్యానాయక్ తండా వరకు రోడ్లు కలగానే మారాయి. పుర్సంపల్లి, మల్కాపూర్, బంగ్రంపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు ఇప్పటికీ మట్టిరోడ్డుపైనే కొనసాగుతున్నాయి. కారణాలేమైనా బొంరెడ్డిపల్లి, కొత్తపల్లి బీటీరోడ్ల పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. కంకర వేసి, తదుపరి పనులను మరిచారని పల్లె ప్రజలు పేర్కొంటున్నారు.


బీటీరోడ్డుకు నోచుకోని పుర్సంపల్లి మట్టిరోడ్డు

ప్రతిపాదనలకే పరిమితం

పల్లె ప్రాంతాల మట్టిరోడ్లను బీటీలుగా మార్చాలని ఏళ్లుగా ప్రజలు కోరుతూనే ఉన్నారు. స్థానిక నాయకులకు విజ్ఞప్తులు ఇస్తూనే ఉన్నారు. అలా వచ్చిన వినతులను స్థానిక నాయకులు వారి నేతలకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. అవన్నీ ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా గ్రామాల ముఖచిత్రం మారడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు మట్టి రోడ్లకు మోక్షం కల్పించి, బీటీ రోడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చొరవ చూపాలి



మా గ్రామానికి బీటీరోడ్డు వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు చాలాసార్లు విన్నవించాం. అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ముందు సరే అంటున్నారు. ఆ తరువాత పట్టించుకోవడం లేదు. మట్టిరోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం. త్వరగా బీటీరోడ్డు వేయించాలి.

– శ్రీనివాస్, పుర్సంపల్లి

త్వరలో ప్రారంభం



బొంరెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. మిగతా గ్రామాల్లో విడతల వారీగా మొదలు పెడతాం. కొన్ని తండాల రోడ్ల గురించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రొసిడింగ్స్ వచ్చిన వాటికి, త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– మణికుమార్, పంచాయతీరాజ్, ఏఈ

తెల్ల బంగారం జిగేల్

- క్రమంగా పెరుగుతున్న పత్తి ధర
- దిగుబడి విక్రయించాక పెరుగుతోందంటూ రైతుల నిట్టూర్పు
- 70వేల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు
- మార్కెట్‌కు రూ.45లక్షల ఆదాయం

మోమిన్‌పేట: తెల్ల బంగారం ధర పైపైకి ఎగబాకుతోంది. రైతుల నుంచి పత్తి కొనుగోలు ప్రక్రియ పూర్తయిన తరువాత క్రమంగా పెరుగుతుండటంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. జనవరికి ముందు క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020లు పలికింది. జనవరి 1 తరువాత రూ.6,920లకు తగ్గింది. ప్రస్తుతం రూ.7,450వరకు పలుకుతోంది. కాటన్ మిల్లులో కొనుగోలు చేసిన దానికి, జిన్నింగ్ పూర్తి చేశారు. వానాకాలం సీజన్‌లో మండల పరిధి గ్రామాల్లో సాగు విస్తీర్ణంలో 80శాతం వరకు పత్తిని సాగు చేశారు. వాతావరణం అనుకూలించక, ఆశించిన దిగుబడులు రాలేదని రైతులు తెలిపారు. దానికి తోడు మార్కెట్లోనూ గిట్టుబాటు కాలేదని చెప్పారు. బహిరంగ విపణిలో ధర తక్కువగా ఉండటంతో.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. మండల కేంద్రంలో ఉన్న అయ్యప్ప కాటన్ మిల్లులో సీసీఐ 70వేల క్వింటాళ్ల దిగుబడిని కొనుగోలు చేసింది. దీంతో సుమారుగా రూ.45కోట్ల వ్యాపారం జరిగింది. అందుకు గాను మార్కెట్ కమిటీకి రూ.45లక్షల ఆదాయం సమకూరింది. కొనుగోలు చేసిన పత్తికి జిన్నింగ్ పూర్తి కావడంతో పత్తి బేళ్లను తరలించారు. పత్తి గింజలను కూడా తరలిస్తున్నారు. ఇక ధర పెరిగేటట్లు లేదని.. రైతులు తమ వద్ద ఉన్న పత్తిని మద్దతు ధరకే విక్రయించారు. తీరా వారి వద్ద ఉన్న దిగుబడిని అమ్ముకున్నాక.. క్రమంగా ధర పెరుగుతుండటంతో రైతులు నిరాశలో ఉన్నారు. దిగుబడులు తగ్గి, పెట్టుబడులు పెరగడం, ఆశించిన స్థాయిలో మద్దతు ధర అందక నష్టపోయినట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.


అయ్యప్ప కాటన్ మిల్లులో పత్తి గింజలను సంచుల్లో నింపుతున్న కూలీలు

అంతారంలో గ్రామసభ

ఉపాధి పనుల నివేదిక సమర్పించిన డీఆర్‌పీ

తాండూరు రూరల్: మండల పరిధి అంతారం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో చేపట్టిన పనులపై డీఆర్‌పీ యాకయ్య గ్రామసభలో నివేదిక సమర్పించారు. అనంతరం గ్రామ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ విజయేంధర్ మాట్లాడారు. వేసవి కాలంలో ఉపాధిహామీ పనుల్లో కూలీలు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శాంతు, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్, మాజీ సర్పంచ్ రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో అధికారులు, ఉపాధి కూలీలు

మల్లికార్జునుడి చెంతకు శివభక్తులు

పెద్దేముల్: మండల పరిధి హన్మాపూర్ గ్రామానికి చెందిన శివ భక్తులు దీక్షను పూర్తి చేసుకోగా.. వారిని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు, గురుస్వామి లోంక నర్సింహులు ఎప్పటిలాగే.. ఈ ఏడు సుమారు 150 మంది భక్తులను శనివారం శ్రీశైలానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ భక్తులకు సేవ చేయడం ద్వారా తనకు కలిసి వస్తుందని నర్సింహులు పేర్కొన్నారు.

భక్తుల సేవలో రహీం..

తాండూరు పట్టణానికి చెందిన రహీం ఐదేళ్లుగా.. భక్తులు శివమాల ధరించి నప్పటి నుంచి, ఇరుముడితో మల్లికార్జునుడి చెంతకు వెళ్లే వరకు తాగునీరు నుంచి ఫలాలు, భోజనం తదితర ఆహార పదార్థాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ.. భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. హిందువులు పూజించే దేవుడు, ముస్లింలు ఆరాధించే అల్లాహ్.. సబ్ కా మాలిక్ ఏక్ హై అంటూ సంతోషం వ్యక్తం చేశారు. కుల మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండటం ఆనందరంగా ఉందన్నాం


భక్తులకు పండ్లు అందజేస్తున్న రహీం

ఎంపీడీఓగా ఉషశ్రీ

కొడంగల్: కొడంగల్ ఎంపీడీఓగా ఉషశ్రీ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇక్కడికు రాక ముందు అపార్డ్ ట్రెయినింగ్ సెంటర్‌లో శిక్షకురాలిగా విధులు నిర్వహించేవారు. ఇంతకు ముందు ఎంపీడీఓగా పనిచేసిన పాండును పూడూరు మండలానికి బదిలీ చేశారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ప్రణాళికతో ముందుకు సాగాలి
- ఎంపీపీ అరవింద్‌రావు
- పైప్‌లైన్ల మరమ్మతుల అనంతరం అంతర్గత రోడ్ల నిర్మాణం
- ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య

పరిగి: 'ఇప్పటి నుంచే ఎండలు మండుతున్నాయి. మార్చిలో మరింత మండే అవకాశాలు ఉన్నాయి. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా, ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలి' అని ఎంపీపీ అరవింద్‌రావు సూచించారు. శనివారం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని చెప్పారు. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చి, సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎండలు ముదరనున్నాయని, భూగర్భ జలాలు అడుగంటి, నీటి సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ నీటి ఎద్దడిని అధిగమించడానికి ప్రణాళికను రూపొందించుకోవాలని వెల్లడించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్య గురించి, తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీఓ దయానంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మర్పల్లి: సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య

లీకేజీలను అరికట్టి..

మర్పల్లి: వేసవి కాలం నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత మిషన్ భగీరథ అధికారుల దేనని ఎంపీడీఓ రాజ్ మల్లయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో.. గ్రామాల వారీగా తాగునీటి వనరులు, గతంలో ఉపయోగిస్తున్న బోర్లు, బావులు, మోటార్ల పనితీరు, నీటి సరఫరాపై ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులను ఎంపీడీఓ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. తాగునీరు సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే.. తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, రోడ్ల నిర్మాణం చేపట్టేముందు తాగునీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు తహసీల్దార్ గణేశ్, ఏఓ వసంత, ఈఓపీఆర్డీ సుశీల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సాయినాథ్, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరత సిబ్బంది తదితరులు ఉన్నారు.

దాడి ఘటనపై పీఎస్‌లో ఫిర్యాదు

- ఫిర్యాదు చేసిన రెవెన్యూ ఉద్యోగులు
- నోటీసులు ఇవ్వకుండా ఎలా సర్వేచేస్తారన్న గ్రామస్తులు

కొడంగల్: అసైన్డ్ భూముల సర్వేకు వెళ్లిన అధికారులపై కొందరు గ్రామస్తులు దాడికి పాల్పడిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అప్పాయిలిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 19లో ఉన్న అసైన్డ్ భూముల పరిశీలనకు గిర్దావర్ శృతి, మరో ఇద్దరు అధికారులతో కలిసి వెళ్లగా.. వీరిపై ఇద్దరు గ్రామస్తులు దాడిచేసి గాయపర్చారు. ఈ ఘటనపై గిర్దావర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు.

తహసీల్దార్ ఆదేశాల మేరకే..

గతంలో ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన అసైన్డ్ భూములను, తిరిగి ఇతర అవసరాల కోసం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. భూమి ఇచ్చిన రైతులకు పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెల్లడించారు. ఈ విషయంలో అధికారులు రైతులకు అవగాహన కల్పించారని తెలిపారు. అయితే కొందరు రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చి, అంగీకార పత్రాలు సైతం ఇచ్చారని వివరించారు. అందులో భాగంగానే.. తహసీల్దార్ విజయకుమార్ ఆదేశాల మేరకు తాను మరో గిర్దావరి రాఘవేందర్, రికార్డు అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ఆ భూములను పరిశీలించడానికి వెళ్లగా.. తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా.. తమపై దాడులకు పాల్పడ్డారని గిర్దావర్ శృతి పేర్కొన్నారు. రికార్డు అసిస్టెంట్‌పై దాడి చేసి, ఆయన ద్విచక్ర వాహనం (టీఎస్ 06 ఈడీ 7257) హెడ్‌లైట్‌ను ధ్వంసం చేశారని వెల్లడించారు. దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. తమను చంపుతామని బెదిరించి కర్రలతో కొట్టడానికి రావడంతో, తప్పించుకొని వచ్చినట్లు అధికారులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు, విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు.


ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

న్యాయం చేయండి

భూముల పరిశీలనకు రెవెన్యూ అధికారులు వచ్చిన సమయంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమను కులం పేరుతో దూషించారని పి.పుష్పమ్మ, పి.శ్రీనివాస్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు నోటీసులు ఇవ్వకుండా సర్వేకు ఎలా వస్తారని ప్రశ్నించడంతో, కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో గ్రామస్తులు పేర్కొన్నారు. విచారించి తమకు న్యాయం చేయాలని పోలీసులను వారు కోరారు.

మహిళలు స్వయం శక్తిగా ఎదగాలి

ధారూరు: మహిళలు స్వయం శక్తిగా ఎదగాలంటే సంస్థాగత నిర్మాణం, తగిన నైపుణ్యం కలిగి ఉండాలని, అప్పుడే వారికి సాధికారత లభిస్తుందని ఎస్‌బీఐ జిల్లా నాబార్డ్ మేనేజర్ పీయూష్ అన్నారు. నాబార్డు సహకారంతో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు 10 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో మహిళలకు సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మిల్లెట్స్ ఆహార శుద్ధీకరణ పరిశ్రమ నెలకొల్పడానికి ఫుడ్ ప్రాసెసింగ్ సాంకేతికత నైపుణ్యం అవసరమని ఆయన సూచించారు. అంతకు ముందు చిరు ధాన్యాల విలువ జోడింపు, పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో సీడీపీఓ మల్లేశ్వరమ్మ మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నాగబ్రహ్మాచారి, మహిళ పొదుపు సంఘం లీడర్ కుమ్మరి అంజలి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్‌బీఐ జిల్లా నాబార్డ్ మేనేజర్ పీయూష్

శోభాయమానంగా గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామపంచాయతీ పరిధి శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో శనివారం పాంబండ క్షేత్ర గిరిప్రదక్షిణ హిందూ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పూడూరు జెడ్పీటీసీ మేఘమాల, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, జిల్లా నాయకులు వెంకటయ్య, స్థానికులు నర్సింహారెడ్డి, పెంటయ్య, హన్మంతు, వెంకటయ్య, శంకర్, ఆలయ అర్చకుడు పాండు శర్మ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన కమిటీ ఏర్పాటుపై హర్షం

బొంరాస్‌పేట: నియోజకవర్గ పరిధి దుద్యాల మండలం పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ కమిటీ పునరుద్ధరణలో భాగంగా నూతన కమిటీ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ దుద్యాల మండల అధ్యక్షుడు శేఖరయ్య అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పోలెపల్లికి చెందిన జయరాములు, సభ్యులు నర్సింహులు, మునికుమార్, రాములు, వెంకటయ్య, యాదయ్య, ఏదుల నర్సింహులు, లక్ష్మిలను ఆయన అభినందించారు. ఇందులో ఆలయ మేనేజరు రాజేందర్‌రెడ్డి, ఉత్సవ నిర్వహణ కమిటీ వెంకట్‌రెడ్డి, బుగ్గప్ప ఉన్నారు.

◆ ఉత్సవాలను విజయవంతం చేయండి



కుల్కచర్ల: ఓంకారేశ్వర స్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో 7వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించే ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు. ఇందులో ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, శివశంకర్, చెన్నయ్య, విజయ్, చిన్న బుచ్చయ్య, వడ్డె చిన్నయ్య, రాజు, బుచ్చయ్య, యాదయ్య, పుల్లప్ప, శివదర్శన్, మందిపల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ స్వయం పరిపాలనా దినోత్సవం

కొడంగల్ రూరల్: పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్‌గా తలహ, డిప్యూటీ కలెక్టర్‌గా అభిషేక్, డీఈఓగా నీరజ్, ఎంఈఓగా ముదస్సిర్, కరస్పాండెంట్‌గా ఆలియా, ఫౌండర్‌గా శివప్రసాద్, చైర్మన్‌గా శివప్రసాద్, ప్రిన్స్‌పాల్‌గా రాజు, వైస్ ప్రిన్స్‌పాల్‌గా రాకేష్‌లతో పాటు 30మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి వారికి పాఠాలు చెప్పారు. ప్రతిభ కనబరిచిన వారికి పాఠశాల ఫౌండర్ డి.వెంకటయ్య, ప్రిన్స్‌పాల్ డివి.నరేష్ రాజ్, వైస్ ప్రిన్స్‌పాల్ సంతోష్, ఉపాధ్యాయ సిబ్బంది బహుమతులు అందించారు.

◆ ధ్యానంతో అనేక లాభాలు

అనంతగిరి: ధ్యానంతో అనేక లాభాలు ఉన్నాయని పిరమిడ్ నేచురల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్త ఆంజనేయరెడ్డి, నవీన్‌లు అన్నారు. శనివారం వికారాబాద్ మండలంలోని ద్యాచారం, గొట్టిముక్కుల గ్రామాల్లో ధ్యానం చేయడంతో కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిత్యం ధ్యానం చేయడంతో అనేక రకాల జబ్బులు నయం అవుతాయని పేర్కొన్నారు. బీపీ, షుగర్ తగ్గుతాయని తెలిపారు. విద్యార్థులు రోజు 15 నిమిషాలు, పెద్దలు గంట పాటు ధ్యానం చేయాలని సూచించారు. ఇందులో సంస్థ ప్రతినిధులు బాలకృష్ణారెడ్డి, బాబు, చెన్నయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

◆ బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ

పూడూరు: మండల అభివృద్ధి అధికారిగా శనివారం డి.పాండు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఉమాదేవి, సిద్దిపేట జిల్లా దుబ్బాకకు ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. కొడంగల్ ఎంపీడీఓగా పనిచేసిన పాండు ఇక్కడికి వచ్చారు.

◆ ఘనంగా ఎల్లమ్మ జాతర



కొడంగల్ రూరల్: బండల ఎల్లమ్మ జాతర ఉత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. శనివారం రైతులు తమ ఎడ్ల బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణ జేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. పాడి పంటలతో పల్లెలు పచ్చగా ఉండేలా చూడాలంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

◆ మార్కెట్‌కు 415 బస్తాల వేరుశనగ

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 415 వెరుశనగ బస్తాలను రైతులు తీసుకు వచ్చారు. క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,150, కనిష్టంగా రూ.6,550 ధరతో కొనుగోలు చేసినట్లు మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. అదే విధంగా కందులు 93 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.9,950 నుంచి రూ.10,190 ధరతో కొనుగోలు చేసినట్లు ఆమె వెల్లడించారు.

◆ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: రంగంపల్లి సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయ కలగనుందని ఏఈ ఖాజ శనివారం ఒక ప్రటకనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రంగంపల్లి, ఇబ్రాహీంపూర్, గడ్సింగాపూర్, సొండేపూర్, సాలిపలెల్లబాటతండా, వివిధ పరిశ్రమలకు కరెంటు ఉండదని వెల్లడించారు.

◆ రోడ్లపై మురుగు నీరు..



దోమ: మండల పరిధి ఐనాపూర్, బొంపల్లి, తిమ్మాయిపల్లి, ఊటుపల్లి, దాదాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో మురుగు కాల్వలు లేక, వ్యర్థజలాలు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద సీసీరోడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ.. అధికారులు నాలాలను నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు ముందుకు సాగక.. దోమలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులు స్పందించి మురికి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోండి

కుల్కచర్ల: సయోధ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధి అల్లాపూర్ గ్రామపంచాయతీలో సంస్థ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణను అందించి, సర్టిఫికెట్లను అందించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఇలాంటి కార్యక్రమాలను మహిళలు ఉపయోగించుకుని, ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, సంస్థ డైరెక్టర్ మృదుల, పంచాయతీ కార్యదర్శి మొమెనా బేగం, మాజీ సర్పంచ్ శివిబాయి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు సూచనలు చేస్తున్న ఎంపీపీ

మహాదేవుడికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో శనివారం శివభక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శివలింగానికి పంచామృతంతో అభిషేకం, విశేష అలంకరణ, శివాష్టోత్తర శతనామావళి, పంచాక్షరి స్తోత్రం, శరణుఘోష, మంగళహారతులు పట్టారు. అనంతరం వడ్డె కిష్టప్ప ఆధ్వర్యంలో శివ భక్తులకు అన్నదానం(బిక్ష) చేశారు.